www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 15 మే 2023



నేడు పెద్దాపురంలో టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - పెద్దాపురం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం పెద్దాపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆ రోజు సాయంత్రం మూడు గంటలకు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సారథ్యంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు ఇంటి వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. లోకేష్ యువ గళం పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించే ఈ పాదయాత్ర మెయిన్ రోడ్డు, పలు రహదారుల మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ పాదయాత్రలో అధిక సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆరిన ఇంటి దీపాలు

- రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళల దుర్మరణం
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- తాళ్లరేవు మండలం కోరంగిలో దుర్ఘటన
- మృతులంతా యానాం వాసులు

ప్రజాశక్తి - తాళ్లరేవు, యానాం, కాకినాడ కార్పొరేషన్

వారంతా మహిళా కార్మికులు. కుటుంబ పోషణ నిమిత్తం యానాం నుంచి తాళ్లరేవులో ఉన్న రొయ్యల ఫ్యాక్టరీకి రోజూ పనికి వెళ్తుంటారు. ఎప్పటి లానే ఆదివారమూ పనికి అందరూ కలిసి వెళ్లారు. పని ముగించుకుని ఒకే ఆటోలో ఇళ్లకు పయనమయ్యారు. ఇదే వారికి చివరి రోజు అవుతుందని ఊహించలేదు. గమ్యం చేరకముందే ప్రయివేటు బస్సు రూపంలో వారిని మృత్యువు కబళించింది. ఏడు కుటుంబాలను శోకసంద్రంలోకి నెట్టేసింది. ఆదివారం తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీలోని సుబ్బారాయుడు దిమ్మ సెంటర్ వద్ద ఓ ప్రయివేటు బస్సు మహిళా కార్మికులతో వెళ్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.



అయినవారిని పోగొట్టుకోవడంతో కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

యానాంలోని ప్రాన్స్‌తిప్ప, కురసం పేట, మెట్టకూరు, వెంకటనగర్ తదితర ప్రాంతాలకు చెందిన 14 మంది మహిళలు తాళ్లరేవు మండలం కోరంగిలోని అపెక్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం పని ముగించుకుని అదే ఫ్యాక్టరీ నుంచి వారంతా ఒకే ఆటలో యానానికి బయలు దేరారు. ఆటో తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని సుబ్బారాయుడు దిమ్మ సెంటర్‌కు వచ్చింది. అదే సమయంలో ఎదురుగా యానాం నుంచి కాకినాడ వైపునకు వెళుతున్న ప్రయివేటు బస్సు వేగంగా వస్తోంది. రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు పెట్టిన బారికేడ్లను సైతం ఢీకొని ఆటోపైకి దూసుకొస్తోంది. ఇది గమనించి డ్రైవర్ ఆటోలో నుంచి దూకేశాడు. అనంతరం బస్సు వేగంగా ఢీకొన్ని దాదాపు 100 మీటర్ల దూరం లాక్కుపోయింది. మృతుల శరీరభాగాలు, రక్తంపు మరకలతో ఆ ప్రాంతం హృదయవిదాకరంగా మారిపోయింది. ఆర్తనాదాలతో మారుమోగింది.

ఈ ప్రమాదంలో యానాం ఫ్రాన్స్ తిప్పకు చెందిన బొక్క అనంతలక్ష్మి(47), వెంకటనగర్‌కు చెందిన చింతపల్లి జ్యోతి(38), కొత్త బస్టాండ్‌కు చెందిన కల్లి పద్మ(38), కురసం పేటకు చెందిన నిమ్మకాయల లక్ష్మి(54), మెట్టకుర్రుకు చెందిన కర్రి పార్వతి(42), మెట్టకురు వంశీకృష్ణ కాలనీకి చెందిన చేశెట్టి వెంకటలక్ష్మి(41), అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ప్రాన్స్‌తిప్పకు చెందిన బుడపనేటి సత్యవతి, రచ్చ వెంకటేశ్వరమ్మ, మల్లాడి గంగాభవాని, బుడపనేటి ప్రభావతి, కురసంపేటకు చెందిన నోట్ల సత్యవేణి, ఓలేటి లక్ష్మి, గణపతి నగర్‌కు చెందిన కోటి నీలిమ, వెంకటనగర్‌కు చెందిన చింతపల్లి మంగాయమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని పోలీసులు అంబులెన్సుల్లో కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుడపనేటి సత్యవతి(38) మృతి చెందింది. మిగిలిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి మురళీకృష్ణ, కాకినాడ రూరల్ సిఐ శ్రీనివాస్, కోరంగి ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్ పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్, ప్రమాదం నుంచి తప్పించుకున్న ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి : సిపిఎం

రోడ్డు ప్రమాదంలో మరణించిన రొయ్యల పరిశ్రమల కార్మికులకు చెందిన ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆసుపత్రుల్లో క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలన్నారు. ప్రమాదానికి మూల కారణమైన బైపాస్ సెంటర్లో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, చొల్లంగి నుంచి ఎదురులంక వంతెన వరకు మధ్యలో డివైడర్‌ను తక్షణం ఏర్పాటు చేయాలన్నారు. రొయ్యల పరిశ్రమల యాజమాన్యం చనిపోయిన కుటుంబాలను ఆదుకోవాలన్నారు.



ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడిఉన్న మహిళల మృతదేహాలు

బాధితులకు పలువురి పరామర్శ

ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన బాధితులను ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, యానాం ఎంఎల్ఎ గొల్లపల్లి అశోక్, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, ముమ్మడివరం జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించడంలో వైసిపి నాయకులు కొపనాతి నాగరాజు తదితరులు సహకరించారు.

మృతులు




బొక్కా అనంతలక్ష్మి(47)




చేశెట్టి వెంకటలక్ష్మి(41)



చింతపల్లి జ్యోతి(38)



బుడపనేటి సత్యవతి(38)



కల్లి పద్మ (35)



నిమ్మకాయల లక్ష్మి(54)



కర్రి పార్వతి(42)

దళితులపై దాడులను అరికట్టాలి

కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - తుని

దేశంలో రాష్ట్రంలో దళితుల పైన గిరిజనులు పైన రోజురోజుకీ దాడులు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. ఆదివారం ఆయన స్థానంకగా మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత కుల వ్యవస్థను పెంచి పోషిస్తున్నాడని విమర్శించారు. ఇందులో భాగంగానే గో సంరక్షణ సమితి పేరు మీద దళితులు, ముస్లిములపై దాడులు జరుగుతున్నాయన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనుధర్మ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి పూనుకుంటున్నారని చెప్పారు. మోడీ గద్దె దిగితే తప్ప దళితులపై దాడులు ఆగే పరిస్థితి లేదని అన్నారు. మతోన్మాద చిచ్చు రగులుస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాతంత్ర వాదులు, అంబేద్కర్ వాదులు అంతా గళమెత్తాలని, మోడీని చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్ సర్కార్‌లో దళితులు, గిరిజనులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. దాడులే కాక హత్యలు కూడా జరుగుతున్నాయన్నారు. కాకినాడ జిల్లాలో ఇటీవల మూడు హత్యలు జరిగాయన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులపై జగన్ ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిషన్ ఉన్న ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కసారే సమావేశం జరిగిందని చెప్పారు. దళిత సంఘాలు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ప్రజాతంత్రవాదులు పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా జగన్ ప్రభుత్వం జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని అగ్రవర్ణాల దాడిలో చనిపోయిన వారికి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం నుండి వచ్చే నష్ట పరిహారం వెంటనే ఇవ్వాలని. రాష్ట్ర విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమావేశాలు జరపాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకుంటే ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా మాతృ దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పిల్లల ఉన్నతి కోసం నిరంతరం తపించే త్యాగమూర్తి అయిన తల్లి ప్రేమకు వెలకట్టలేమని న్యాయవాది పెండెం శ్రీదేవి పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మాత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లులు చూపే ప్రేమ, సంరక్షణ, త్యాగాలను మననం చేసుకోవడానికి ఏటా మే నెల రెండో ఆదివారం మాత దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. మాతత్వ బంధాలను గౌరవించే చక్కని రోజు అన్నారు. మన భారతీయ సమాజం యొక్క మొత్తం శ్రేయస్సుకు తల్లి యొక్క విస్తారమైన ప్రాముఖ్యతను ఒక రోజే కాక ప్రతిక్షణం గుర్తించాలన్నారు. నిస్వార్థమైన సహకారాన్ని అందించేది ఒక్క అమ్మ మాత్రమేనని అన్నారు. ఆ దిశగానే చట్టరీత్యా కనిపెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు రక్షణ కల్పించబడిందని శ్రీదేవి తెలిపారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ సమకూర్చిన నూతన వస్త్రాలను పిల్లలచే తల్లులకు బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ కుమార్ యాదవ్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఎస్. శ్రీ నగేష్, రాజా, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి అన్నారు. మే డే పక్షోత్సవాల్లో భాగంగా పెద్దాపురం మండలం వడ్లమూరు గాంధీ బొమ్మ సెంటర్లో క్వారీ లారీ యూనియన్ డ్రైవర్ల సంఘం ఉపాధ్యక్షులు అల్లాడి సూరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కార్మికుల నిజ వేతనాలు రోజురోజుకూ పడిపోతున్నాయన్నారు. కనీస వేతనాలు అమలు చేయమన్నా, కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించమన్నా కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒకదాని తర్వాత ఒకటి అదానీకి కట్టబెడుతూ కార్మికులపై భారాలను మోపుతున్నాయన్నారు. కార్పొరేట్ల లాభాల కోసం కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ విధానాలను ప్రతిఘటించే కార్యక్రమాల్లో కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు దాడి బేబీ,ఎస్ సూరిబాబు, నూర్జహాన్, ప్రసన్న కుమారి,డ్రైవర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



పక్షోత్సవాల్లో ప్రసంగిస్తున్న శేష బాబ్జి



ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న 104 నాయకులు

సమస్యలపై ఎంఎల్ఎకు 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి -ఏలేశ్వరం

తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి సహకరించాలని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ వినతిపత్రంలో కరోనా సమయంలో కూడా సేవలందించామని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషిస్తున్నామని తెలిపారు. తమకు జీతాలు, పిఎఫ్ వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ట్రాన్స్‌ఫర్ సౌకర్యం కల్పించాలని కోరారు.

వివాహానికి హాజరైన ఉద్యోగ సంఘాల నేతలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

స్థానిక వాకలపూడి వేదిక కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర ఆర్ అండ్ బి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చెల్లిబాని పాపారావు కుమార్తె వివాహానికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కెఆర్.సూర్యనారాయణ హాజరయ్యారు. ఆయన పాపారావు కుమార్తె ప్రవల్లిక, ప్రతాప్ దంపతులను ఆశీర్వదించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం జగన్నాథం, జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.వీరయ్య, వాణిజ్య పన్నుల శాఖ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.జయచంద్ర, రాష్ట్ర నాయకులు జి.ఆస్కార రావు, బి.శ్రీకాంత్ రాజు, జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.గోవిందు తదితరుల హాజరయ్యారు.

కాకినాడలో ఖాళీ స్థలాల్లో చెత్త తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కమిషనర్ మహేష్ కుమార్ రావిరాల పిలుపు మేరకు ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు ఆదివారం కాకినాడ వెంకట్ నగర్ ప్రాంతంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్ నాగ.నరసింహారావు పాల్గొని పర్యవేక్షించారు. నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాల్లో స్థానికులు, పరిసర ప్రాంతాల ప్రజలు చెత్తను వేయడం వల్ల ఆ స్థలాలు డంపింగ్ యార్డుల్లా మారుతున్న పరిస్థితుల్లో ఈ డ్రైవ్ చేపట్టారు. కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు వైడి.రామారావు, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వెంకట్ నగర్ ప్రాంతంలోని ఎంపిక చేసిన కొన్ని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఒక జెసిబి, చెత్త తరలింపునకు ట్రాక్టర్‌తో పాటు చెత్తను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను కూడా నియమించారు. ఎడిసి నాగ నరసింహారావు ఈ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించి చెత్తను ఖాళీ స్థలాల్లో వేయవద్దంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పథ్వీచరణ్, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిషోర్, శానిటరీ సూపర్వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్లు కార్యక్రమానికి హాజరయ్యారు.

చెత్తను వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

చెత్తను ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు ఇవ్వకుండా దగ్గరలోని ఖాళీ స్థలాల్లో వేసే వారికి నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకుంటామని ఎడిసి సిహెచ్.నాగ నరసింహారావు స్పష్టం చేశారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది స్థల యజమానుల నిర్లక్ష్య వైఖరి వల్ల చెత్త పేరుకుపోయి పందులు, కుక్కలు, పాములు, దోమలు చేరి ప్రజారోగ్యానికి భంగకరంగా మారుతోందన్నారు. అటువంటి స్థలాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టినప్పటికీ అందుకు అయ్యే ఖర్చును, స్థల యజమానుల పైన, చెత్తను వేసే వారి నుంచి వసూలు చేస్తామన్నారు. అవసరమైతే చట్ట ప్రకారం కఠిన చర్యలు కూడా తప్పవన్నారు. డ్రైవ్‌లో భాగంగా కాకినాడ నగరంలో గుర్తించిన నాలుగు వేల ఖాళీ స్థలాలకు సంబంధించి 780 స్థలాల్లో చెత్త అధికంగా పేరుకుపోయినట్టు గుర్తించామన్నారు.

కళారూపాల విజేతలకు బహుమతి ప్రదానం


ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం రాయభూపాలపట్నంలో జరిగిన కుంతీదేవి అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన జానపద కళారూపాల ప్రదర్శనల్లో ఉత్తమ ప్రదర్శకులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ జాతరలో ఎనుపోతు చర్మంతో తయారుచేసిన పెద్ద డంకా వాయిద్యం, కళాకారులు మోకాళ్ళ వరకు గడ్డి చుట్టుకుని కాళ్లకు ఇనప గజ్జెలుతో ప్రదర్శించే ప్రాచీన జానపద గారడి కళారూపాన్ని పలు గ్రామాల కళాకారులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శకులలో పేరా రామచంద్రపురం కళాకారులు ప్రదర్శించిన కళారూపం ప్రథమ బహుమతి సాధించింది. మర్రిపూడి, గొర్రెపల్లి, కొత్త మంజీర గ్రామాల కళాకారుల కళారూపాలను కూడా ఎంపిక చేసి కళాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉంగ్రా వెంకట్, నొక్క బేబీరత్నం, లాజర్, పచ్చిపాల సత్తిబాబు, వడ్లపాటి చిట్టిబాబు, బుజ్జి బాబు, నాని, వల్లపు సత్తిబాబు, శివకష్ణ, సిద్ధు, సాంబత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన బహుతులతో విజేతలు

కార్టూ'నిజం'



బాధితులకు రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తాళ్లరేవు రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, సిహెచ్.రాజ్‌కుమార్, కోశాధికారి ఎంవి.రమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం, గాయపడిన వారికి మెరుగైన వైద్యం, తగు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు జిల్లాలో దాదాపు 1000 పరిశ్రమలు ఉంటే దీనిలో పనిచేసే కార్మికులకు పిఎఫ్ ఇఎస్ఐ అమలు జరగటం లేదని, అమలు చేయించాల్సిన లేబర్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కాకినాడ జిల్లాలో ఇటీవల పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో అధికారులతో మీటింగులు పెట్టే పని మాత్రమే చేస్తున్నారని విమర్శించారు. తాళ్లరేవు ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రొయ్యల పరిశ్రమ యాజమానులు కార్మికులకు పిఎఫ్ ఇఎస్ఐ అమలు చేసి ఉంటే కార్మికుల కుటుంబాలకి ఈ రెండు బోర్డుల నుంచి దాదాపు రూ.ఏడు లక్షల పైబడి నష్టపరిహారం వచ్చి ఉండేదన్నారు. వారి కుటుంబంలో వారికి పెన్షన్ కూడా వచ్చి ఉండేదన్నారు. ఇప్పటికైనా జిల్లా లేబర్ అధికారులు ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ జిల్లా కలెక్టర్ జిల్లాలో ఉన్న పరిశ్రమలు అన్నింటిలో పని చేస్తున్న కార్మికులందరికీ పిఎఫ్ ఇఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల జంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలని అన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు సిఐటియు జిల్లా కమిటీ నుంచి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో 7 వ రోజు వాడపల్లి విమలారాణి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఆర్.వెంకటేశ్వరరావు గణితంలో మెలకువలు వివరించారు. జి.వెంకటరావు స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కథలు చదివించడం, కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, పుస్తక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, సింగం బుల్లయ్య, మరియమ్మ, పాఠకులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో..



ఏలేశ్వరంలో..

చిత్రలేఖనం ద్వారా సజనాత్మకత

చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో నిగూఢంగా ఉన్న సజనాత్మకతను బయటకు తీయచ్చని ప్రముఖ చిత్రకారుడు మామిడి రాము అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆయన విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలకువలను వివరించారు. అనంతరం ప్రకతి వ్యవసాయం పెరటి మొక్కలు వాటి ఉపయోగాలను మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రవికొండల సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు

ప్రజాశక్తి-రౌతులపూడి

ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం సందర్భంగా మండలంలోని వైసిపి నేతలు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఛైర్‌పర్సన్‌గా ఇటీవల నియమితులైన జిగిరెడ్డి రమణమ్మ ఆదివారం ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో ప్రమాణం స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు జీగి రెడ్డి శ్రీను. డిసిసిబి డైరెక్టర్ మధు. జడ్పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, వాసిరెడ్డి భాస్కర్ బాబు ఉన్నారు.

21న విశాఖలో ఆదివాసీ సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 21న విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగే ఆదివాసీ అఖిలభారత సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పెద్దాపురంలో ఎఐకెఎంఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం వారపు సంతలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు, గెద్దాడ సూరిబాబు, కిలాని బాబూరావు, కర్నాకుల రామలింగేశ్వరరావు, బులిపే గోపి, నాయుడు కష్ణ, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నిద్ర మాత్రలు మింగిన యువకుడు మృతి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

నిద్ర మాత్రలు మింగిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటన ఏలేశ్వరం శివారు కంబాలపాలెం కాలనీలో చోటు చేసుకుంది. ఏలేశ్వరం ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం కంబాలపాలెం కాలనీకి చెందిన పప్పుశెట్టి రామదుర్గ (23) గురువారం రాత్రి అధిక సంఖ్యలో మిత్రమాత్రలు మింగాడు. దీంతో కుటుంబసభ్యులు ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా 108 వాహనంలో కాకినాడ తరలించారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మతిస్థిమితం లేక నిద్ర మాత్రలు మింగినట్లు మతుని తండ్రి గణేష్ ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

బైకు చెట్టును ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

బైకు చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన ఎర్రవరం ఆర్ అండ్ బి రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ.సతీష్ తెలిపిన వివరాలివి. ఏలేశ్వరం రెల్లి పేటకు చెందిన ఉండూరు వెంకటరెడ్డి, పల్లపు వీధికి చెందిన కొండపల్లి దుర్గా అశోక్ అనే స్నేహితులు. బైకుపై ఎర్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా చెట్టును ఢీకొనడంతో వెనుక కూర్చున్న కొండపల్లి దుర్గ (18) అక్కడికక్కడే మతి చెందగా,ఉండూరు వెంకటరెడ్డి తీవ్ర గాయాలు పాలయ్యాడు. అతడిని స్థానికులు ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స నిర్వహించి 108 వాహనంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసుల్లో బ్యాంక్ మాజీ మేనేజర్ అరెస్టు

ప్రజాశక్తి-అన్నవరం

బ్యాంకులో పని చేస్తున్న మేనేజర్ దొంగ అయితే ఇక పరిస్థితి ఏమిటని పోలీసులే విస్తుపోయిన సంఘటన ఇది. రెండు రోజుల కిందట అన్నవరంలో అర్ధరాత్రి ఒక ఇంట్లో జరిగిన చోరీ కేసులో 48 గంటల్లోపుగానే దొంగను అరెసుఉట చేసి పోలీసులు సొత్తును రికవరీ చేశారు. అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు వివరాలు వెల్లడించారు. నర్సీపట్నం పీనారిపాలెం గ్రామానికి చెందిన చిటికెల నాగేశ్వరరావు గతంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా 2017లో నియమితుడయ్యాడు. అప్పటినుండి ఇతడు ఆలమూరు, కిర్లంపూడి, గొల్లప్రోలు మండల గ్రామాల్లో సదరు బ్యాంకు బ్రాంచీల్లో పని చేసిన సమయాల్లో సుమారు ఒక సంవత్సరం పాటు అన్నవరంలో సత్యదేవ జూనియర్ కళాశాల వెనుకన ఉన్న న్యూ కాలనీలో కుటుంబంతో కాపురం ఉండేవాడు. ఏలేశ్వరం నిడమర్రు చైతన్య గ్రామీణ బ్యాంక్‌లో పని చేస్తూ బెట్టింగులకు అలవాటు పడ్డాడు. బ్యాంకుల్లో ఉన్న లాకర్లో బంగారాన్ని కూడా అమ్ముకున్న కేసులో సస్పెండ్ అయ్యాడు. బెట్టింగుల కోసం డబ్బు గురించి దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఏలేశ్వరంలో ఎటిఎంలో రూ.మూడు లక్షల చోరీకి పాల్పడిన కేసులో రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. బెయిల్‌పై బయటకు వచ్చినా బుద్ధి మార్చుకోక గతంలో అన్నవరంలో తాను కాపురం ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నాడు. ఈ నెల12న అర్ధరాత్రి గోగుల వీరభద్రరావు ఇంటిలో ఎవరూ లేని సమయంలో తాళాలు బద్దలు కొట్టి సుమారు 33.8 రాముల బంగారం 1.5 కేజీల వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు కాజేశాడు.

పూర్వ మిత్రుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-కరప

కరప నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 92-93 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. పాఠశాలకు వీరు తయారు చేయించిన నూతన లోగోను స్కూల్ ప్రధానోపాధ్యాయులు లీలా మనోహర్‌కు అందజేశారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. వారితో తమకు గల తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. విద్యార్థులు ఒకరితో ఒకరు తమ స్నేహ మాధుర్యాన్ని పంచుకున్నారు. ఈ పూర్వ విద్యార్థులలో కొంతమంది ఉపాధ్యాయులుగా, సబ్ రిజిస్ట్రార్‌గా, కొంతమంది గవర్నమెంట్, ప్రైవేట్ ఉద్యోగులుగా సాఫ్ట్ వేర్ ఉద్యోగులుగా, వివిధ వ్యాపారాల్లో స్థిరపడ్డారు. వీరిలో కొంతమంది హైదరాబాద్, బెంగళూరు, వైజాగ్ తదితర ప్రాంతాల నుంచి వచ్చి కష్టసుఖాలను పంచుకున్నారు. వీరందరూ ఒక ట్రస్ట్‌గా ఏర్పడి తమ బాల్య మిత్రుల బందంలో వెనుకబడిన వారికి సహాయ సహకారాలు అందిస్తూ తద్వారా గ్రామాభివద్ధికి, స్కూల్ అభివద్ధికి తోడ్పడాలని ఒక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

సూర్యారావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా విశాఖలోని పౌర గ్రంథాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎల్ఎన్.స్వామి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలువురి కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి పాల్గొని ఎన్టీఆర్ పోస్టల్ స్టాంపులు విడుదల చేశారు. అనంతరం కాకినాడకు చెందిన కళాకారుడు తురగ సూర్యారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని జిల్లా పర్యావరణ పర్యవేక్షక ఇంజనీర్ అశోక్ కుమార్, ధరిత్రి పరిరక్షణ సమితి చైర్పర్సన్ సీమకుర్తి సురేఖ పిలుపునిచ్చారు. వరల్డ్ ఎర్త్ డే సందర్భంగా పర్యావరణ పరిరక్షణ శాఖ, ధరిత్రి పరిరక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన విధానంపై అవగాహనా ర్యాలీ స్థానిక కుళాయి చెరువు వద్ద నుండి జేఎన్టీయూకే వరకు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రధాని మోదీ 2021లో ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి సంవత్సరం మే 15వ తేదీన వరల్డ్ ఎర్త్ డే నిర్వహిస్తున్నామని అన్నారు. ప్లాస్టిక్ వాడుక నిషేధం, ఆరోగ్య కరమైన ఆహారం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ప్రజలు పర్యావరణ హితమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరి రిఫైనరీ జీఎం ఆపరేషన్స్ బి.రామాంజనేయులు, సీనియర్ మేనేజర్ ఎల్వి వెంకటేశ్వరరావు, ఎన్.కొండరాజు, కె.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, అశోక్ కుమార్, సీమకుర్తి సురేఖ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సబ్జెక్టు ఉపాధ్యాయుల నియామకం

పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి నాగమణి



ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

హైస్కూల్ విద్య తర్వాత పేద పిల్లలు, ముఖ్యంగా బాలికలు చదువులకు దూరం అవుతున్నారని గుర్తించిన ప్రభుత్వం ప్రతి మండలానికీ ఒక బాలికల జూనియర్ కళాశాలను గత విద్యా సంవత్సరంలో ప్రారంభించారు. వాటినే ప్లస్ 2 పాఠశాలలుగా పిలుస్తున్నారు. మరింత మెరుగైన విద్యను అందించాలనే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం ఈ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఎన్ని హైస్కూళ్లలో తరగతులు జరుగుతున్నాయి..

2022-23 విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 45 హైస్కూళ్లను జూనియర్ కళాశాలలు (ప్లస్ 2 స్కూల్స్)గా గుర్తించి, ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. తూర్పు గోదావరి జిల్లాలో 9, కాకినాడ జిల్లాలో 13, కోనసీమ జిల్లాలో 21 ఉన్నాయి. హైస్కూల్ ప్లస్ స్కూల్స్‌లో ఎంపిసి, బైపిసి, సిఇసిల్లో రెండు కోర్సులు మాత్రమే ప్రస్తుతానికి అందిస్తున్నారు. స్థానికంగా ఉన్న డిమాండ్‌తో కోర్సులు పెంచుతారు. ఆయా ఉన్నత పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన సాగుతుంది.

ఉపాధ్యాయుల నియమకం ఎప్పుడు జరుగుతుంది..

ఈ ఏడాది ఈ స్కూళ్లలో ఇంటర్‌లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ప్రభుత్వం ప్లస్ 2 స్కూల్స్‌లో ఇంటర్ విద్యా బోధనను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్కూల్ అసిస్టెంట్లలో అర్హత ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులను జూనియర్ కళాశాలల్లో నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. బోధన మరింత మెరుగుపడేందుకు ఈ భర్తీ చాలా ఉపయోగపడుతుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పోస్టులు భర్తీ అవుతాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రాతిపదికన అర్హతలు ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్‌తో ఆర్థిక ప్రయోజనం కల్పించి, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు అర్హత, ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరుతూ నోటిఫికేషన్ విడుదల అయింది. మూడు జిల్లాల్లో 335 మంది స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం లభించనుంది.

మంజూరైన పోస్టులు వివరాలు తెలియజేయండి..

ఉమ్మడి జిల్లాలో తెలుగు 48, ఇంగ్లిషు 48, గణితం 40, ఫిజిక్స్ 47, కెమిస్ట్రీ 47, బోటనీ 39, జువాలజీ 39, సివిక్స్ 9, ఎకనామిక్స్ 9, కామర్స్ 9 పోస్టులు భర్తీ కానున్నాయి.

ఫెయిల్ అయిన విద్యార్థులపై ఎటువంటి శ్రద్ధ వహిస్తున్నారు..

పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారించింది. ఫెయిలైన విద్యార్థులను గట్టెక్కించేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. పదో తరగతి పరీక్షల ఫలితాలు ఈ నెల 6న విడుదలయ్యాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 68,759 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,021, తూర్పు గోదావరి జిల్లాలో 6,667, కాకినాడ జిల్లాలో 8,750 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీంతో పరీక్షల విభాగం వచ్చే నెల 2 నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో పది సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫెయిలైన విద్యార్థులకు స్పెషల్ సమ్మర్ కోర్సులు నిర్వహిస్తున్నాం.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ గీత, ఎంఎల్ఎ పర్వత ప్రసాద్

వైద్యానికి ప్రభుత్వం పెద్ద పీట

ప్రజాశక్తి-ఏలేశ్వరం

వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మించిన పిహెచ్‌సి భవనాన్ని ఆమె ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యా వైద్యం మహిళా సాధికారికరతకు అనునిత్యం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే విధంగా జగనన్నకు చెబుదాం ప్రోగ్రాంకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల క్రాంతి సుధాకర్, వైసిపి నాయకులు, వైద్యులు వైద్య సిబ్బంది ఉన్నారు.

ముఖ హాజరుతో పారిశుధ్య కార్మికుల అవస్థలు

రోజుకి నాలుగు సార్లు హాజరు అంటే ఎలా
స్మార్ట్ ఫోన్ ఉపయోగించని వారే ఎక్కువ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎఫ్ఆర్ఎస్ (ఆంధ్రప్రదేశ్ ఫేస్ రికగ్నైజింగ్ సిస్టం) పేరుతో అన్ని ప్రభుత్వ శాఖల పర్మినెంట్, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హాజరు కోసం ఒక యాప్‌ను ప్రవేశపెట్టింది. దీన్ని మున్సిపల్ కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నిబంధనల ప్రకారం సమయానికి అన్ని పనులూ చేస్తున్న తమకు మొబైల్ ముఖ హాజరు అవసరమా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ విధానం వలన మాపై అదనపు భారం తప్ప ఒరిగిందేమీ లేదని ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, తుని, పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, మండపేట, రామచంద్రపురం, అమలాపురం పట్టణాలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, ముమ్మిడివరం నగర పంచాయతీల్లో 1168 రెగ్యులర్, 1852 మంది ప్రైవేటు పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు.

కాకినాడ నగరపాలక సంస్థ పరిధి పారిశుద్ధ్య విభాగంలో 1092 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో 402 మంది రెగ్యులర్ కార్మికులు కాగా 690 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో 100 మంది రోజూవారీ కార్మికులు ఉన్నారు. పట్టణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు కీలకంగా ఉన్నాయి.

ఇప్పటికే మున్సిపల్ కార్మికులకు ముఖ హాజరు విధానం అమలవుతోంది. కార్మికులు తమంతట తాము కాక శానిటరీ ఇన్స్పెక్టర్ లేదా కొత్తగా నియమించిన సచివాలయ ఉద్యోగులు ప్రతీ వర్కర్ ని ఉదయం 5:30.కే తమ దగ్గర ఉన్న సెల్ ఫోన్ ద్వారా ఫేస్ అటెండెన్స్ తీసుకుంటున్నారు. మస్తరు కార్యాలయంలో రాతపూర్వక హాజరు కూడా నమోదు చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత కూడా ఇదే విధంగా హాజరు తీసుకుంటున్నారు. దీనివల్ల ఫేస్ అటెండెన్స్ తీసుకున్న దానికి, సర్కిల్ కార్యాలయంలో రాతపూర్వకంగా తీసుకున్న హాజరుకు పోలిక లేకపోవడం వల్ల చాలా సందర్భాల్లో మున్సిపల్ కార్మికుల జీతాల్లో కోతలు విధిస్తున్నారు. అందువల్లే దీనిని వారంతా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. ఇప్పుడు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఏపీఎఫ్ఆర్ఎస్ ప్రకారం ఉదయం డ్యూటీకి వచ్చినప్పుడు తిరిగి వెళ్లేటప్పుడు, మధ్యాహ్నం మరలా విధులకు హాజరయ్యేటప్పుడు సాయంత్రం మళ్లీ ఇళ్లకు వెళ్లేటప్పుడు ముఖ హాజరు వేయాల్సి ఉంటుంది.

శానిటేషన్ వర్కర్లలో ఎక్కువ మంది చదువుకోని వారే ఉన్నారు. ఒకవేళ కొద్దిగా చదువుకున్నా ఫోన్ సాధారణ వినియోగం తప్ప ఒటిపి వంటి మెసేజ్‌లు కూడా చూడలేరు. ఈ నేపథ్యంలో సొంతంగా ముఖ హాజరు సాధ్యం కాని పరిస్థితి. ఇప్పుఇకే ప్రతి మున్సిపల్ కార్మికుని పనిపై పర్యవేక్షించడానికి పలువురు అధికారులు ఉన్నారు. శానిటరీ మేస్త్రి, శానిటరీ ఇన్స్పెక్టర్, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, అదనపు కమిషనర్, కమిషనర్ వీరంతా పారిశుద్ధ్య పనులను నిత్యం పర్యవేక్షణ చేస్తుంటారు. మీరు కాక వాలంటీర్లు, స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు కార్మికులు పనిలో ఉన్నారో లేదో చూస్తూ ఉంటారు. ఇటీవల కాకినాడ నగరంలో రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెత్త పన్ను వసూలు చేయడం వల్ల చెత్త తీసుకువెళ్లకపోతే మున్సిపల్ కార్మికులు వచ్చారా లేదా అనేది ప్రజలే అడుగుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇంతమంది పర్యవేక్షణ ఉంటే మున్సిపల్ కార్మికులకు ముఖ హాజరు పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ కార్మికులు మొబైల్ కొనుగోలు చేసినా తాను పనిచేసే సందర్భంలో మొబైల్ మరమ్మతులు గురైనా లేదా డ్రైనేజీలో జారి పడినా మరొక ఫోన్ వచ్చేటప్పటికి అతను హాజరు ఏవిధంగా తీసుకుంటాడని ప్రశ్నిస్తున్నారు.

ముఖ హాజరు సరికాదు

పాత పద్ధతులను రద్దు చేయాలని కోరుతుంటే కొత్తగా మొబైల్ యాప్ ద్వారా హాజరును తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శోచనీయం. ప్రభుత్వం ఇచ్చిన ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

జలగడుగుల శ్రీనివాస్,
ఎపి మున్సిపల్ వర్కర్స్
ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నేత, కాకినాడ

ఆందోళనలు ఉధృతం చేస్తాము

క్షేత్రస్థాయిలో ముఖ హాజరు ఇబ్బందులపై ఆందోళనలు ఉదతం చేస్తాం. ఇప్పటికే సంతకాల సేకరణ చేసి ఆందోళన నిర్వహించడంతోపాటు కమిషనర్లకు వినతి పత్రాలు అందజేసాం. రాష్ట్రవ్యాప్తంగా కూడా దీనిపై ఆందోళనలో కొనసాగుతున్నాయి.

- యర్రంశెట్టి నాగబాబు,
పారిశుధ్య కార్మికుడు కాకినాడ.



మోడరన్ విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో వెంకట కుమారిని సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా మాతృదినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రపురం పట్టణంలోని మోడ్రన్ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యా సంస్థల ప్రాంగణంలో వెంకట కుమారిని ఘనంగా సత్కరించారు. అనంతరం జివి.రావు మాట్లాడుతూ మాతృమూర్తుల సేవలను కొనియాడారు. ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్స్ నమోదు సంప్రదాయంగా ప్రారంభించారు.తొలి రోజు అద్భుతమైన స్పందన వచ్చినట్లు వివరించారు. అడ్మిషన్ నమోదులో పాల్గొన్న మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. సోమవారం కూడా ప్రత్యేక అడ్మిషన్ ఫీజు మినహాయింపుతో నమోదు జరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో మోడరన్ స్టాఫ్, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంజనేయునికి వెండి కిరీటం అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి యాత్రికులు ఆదివారం వెండి కిరీటం అందజేశారు. హనుమత్ జయంతి ఉత్సవాల సందర్భంగా మండలంలోని కొత్తూరు సెంటర్లో ఉన్న సీతారామాంజనేయస్వామి ఆలయానికి సంభందించి పలువురు యాత్రికులను నుంచి విరాళాలు సేకరించారు. విరాళాలు రూ.80 వేలు సమకూరాయి. ఈ మొత్తంతో వెండి కిరీటాన్ని, నాగవల్లీ దళాలను తయారు చేయించి స్వామి వారికి అందజేశారు. అలాగే వారంతా ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామికి అలంకరించారు. అనంతరం కొత్తూరు సెంటర్ భాస్కర టిఫిన్ సెంటర్ అధినేత పసుపులేటి భాస్కరరావు మనుమలు పసుపులేటి జ్యోత్స్న, నాగప్రజ్ఞకుమారి, గణపతి శివసూర్య భాస్కర్‌ల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలో మెహార్ ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెదపళ్లకు చెందిన నామాల మెహర్ చైతన్య శనివారం రాత్రి విడుదలైన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ 2022 పరీక్షల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో 898వ ర్యాంకు సాధించాడు. ఈ విజయంతో భారత దేశ ప్రభుత్వ రంగ సంస్థల్లో అత్యుత్తమ సంస్థగా పేరు గడించిన కంట్రోల్ అండ్ ఆడిట్ జనరల్ ఆఫ్ ఇండియాలో ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడు. మెహర్ చైతన్య ప్రస్తుతం ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్లో హైదరాబాదులో పని చేస్తున్నాడు. చైతన్య గతంలో జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో పలుమార్లు ప్రతిభ చూపాడు. 2017 ఎస్ఎసిసిలోనూ, 2019లో ఇన్కమ్ టాక్స్ అసిస్టెంట్ గాను, 2020లో జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షల్లో భాగంగా స్టాటిస్టికల్ ఆఫీసర్ గాను విజయాలు సాధించాడు. ప్రస్తుతం మరోమారు జాతీయస్థాయి పోటీ పరీక్షలో ప్రతిభ చూపిన చైతన్యను పలువురు అభినందించారు.

టిడిపి నాయకునికి మంత్రి వేణు పరామర్శ

ప్రజాశక్తి-రామచంద్రపురం

జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు, టిడిపి అమలాపురం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు చింతపల్లి వీరభద్రరావును మంత్రి వేణు ఆదివారం పరామర్శించారు. వీరభద్ర రావు కు ఇటీవల సతీ వియోగం కలిగింది. ఈ సందర్భంగా మంత్రి వేణు హసన్ బాద గ్రామంలో వీరభద్రరావున స్వగృహంలో పరామర్శించారు. వీరభద్రరావు కుటుంబ సభ్యులతో ను మంత్రి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, కె.బాబురావు, చింతపల్లి ఈశ్వరరావు, వెంకట రమణ, చిన వెంకటరెడ్డి, చింతపల్లి అర్జున్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగించుకోవాలి



అమలాపురం గ్రంథాలయలో విద్యార్థులతో వరప్రసాద్

ప్రజాశక్తి-అమలాపురం

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వరప్రసాద్ పిలుపునిచారు. అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఆయన కార్యదర్శి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ శిబిరాన్ని ఉపయోగించుకుని గ్రంథాలయంలోని పుస్తకాలు , కథలు, జీవిత చరిత్ర పుస్తకాలు ఇతర విజ్ఞాన విజయాలకు సంబంధించినవి చదివి మేథాశక్తిని పెంపొంది ంచుకోవాలని పిలుపునిచ్చారు. అమలాపురం గ్రంథాలయం నందు పాల్గొన్న విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి వారిని అభినందించారు. విద్యార్థులు పాడిన పాటలు విన్నారు. గ్రంథాలయ నిర్వాహకుడు పోలిశెట్టి సత్య నారాయణ మూర్తి ని అభినందించారు.

మానసిక ఆరోగ్యానికి యోగా దోహదం

కపిలేశ్వపురం శారీరక, మానసిక వికాసానికి యోగాసనాలు దోహదం చేస్తుందని గ్రామ సర్పంచ్ సాక శ్రీనివాస్ అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా కపిలేశ్వరపురం శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారి డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సంద ర్భంగా విద్యా ర్థులకు యోగా స నాలు, ఆవశ్యకత పై వి వ రి ం చా ర ు. యోగా శిక్షకుడు భా ను తేజ విద్యా ర్థులచే సూర్య నమస్కా రాలు, పలు రకా ల యోగా సనాలు వేయించారు. ప్రతి నిత్యం యోగా చేయడం ద్వారా ఆరో గ్యాన్ని పెంపొంది ంచుకోవచ్చున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ చిట్టూరి సత్యనారాయణ, లక్ష్మి, గ్రంథాలయ పాలకురాలు శివకుమారి, రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో యోగాసనాలపై శిక్షణ

అధిక ఉష్ణోగ్రతలతో అవస్థలు

నిర్మానుష్యంగా మారిన మెయిన్ రోడ్లు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వేసవి ఉష్ణోగ్రత లు రోజు రోజుకూ పెరిగి ఆదివారం నాటికి 43 డిగ్రీలకు చేరుకోవడంతో జనం ఎండ వేడికి తట్టుకోలేక బెంబేలెత్తి పోయారు. ఉదయం పది గంటలు నుంచే ఎండ వేడిమి క్ర మేపి పెరుగు తుండటంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వేడికి తట్టుకోలేక ఇక్కట్లు కు గురవుతున్నారు. మధ్యానం అయ్యే సరికి మెయిన్ రోడ్లు అన్నీ నిర్మానుష్యం గా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. వేడికి తట్టుకోలేని ప్రజలు ఇళ్లకే పరిమిత మవుతున్నా రు. ఇక సోమవారం నుంచి మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మరో వైపు వాతావరణం అనుకూలించడంతో దాళ్వా కోతలు ముమ్మ రంగా జరుగుతున్నాయి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండ టంతో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. వడదెబ్బకు గురికాకుండా మంచి నీరు, ఒ అర్ఎస్ ద్రావణం తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.



నిర్మానుష్యంగా ద్రాక్షారామ,యానాం రోడ్డు



ఎంఎంసి పాలకవర్గం ప్రమాణస్వీకారం

ఎఎంసి చైర్మన్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మండపేట

మండపేట నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ గా చిక్కాల శ్రీనివాసరావు, పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం కార్యక్రమం మండలంలోని ద్వారపూడి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మాట్లాడుతూ పదవులకు వన్నె తెచ్చే విధంగా పని చేయాలని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ రఘురామరాజు పుట్టినరోజు


ప్రజాశక్తి-ఆత్రేయపురం

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపీ రఘురామరాజు పుట్టినరోజు సందర్భంగా ఆత్రేయపురంలో ఆదివారం ఆయన అభిమానులు గాదిరాజు ప్రసాద్ రాజు, ఆయన ఫాలోవర్స్ బస్టాండ్ సెంటర్లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు.

భారత న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షునిగా కెఎస్ఎన్.రెడ్డి

ప్రజాశక్తి-రావులపాలెం

భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర మహాసభలలో తూర్పుగోదావరి జిల్లా కి భారత న్యాయవాదుల సంఘం తరపున వైస్ ప్రెసిడెంట్ గా రావులపాలెంకు చెందిన కెఎస్ఎన్.రెడ్డి ని నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం చలసాని అజయ్ కుమార్, ముప్పాళ్ళ సుబ్బారావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కెఎస్ఎన్.రెడ్డి కొత్తపేట బార్ అసోసి యేషన్‌కి వైస్ ప్రెసిడెంట్ గాను, అలాగే భారత్ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యు నిగా కొనసాగుతున్నారు.



కెఎస్ఎన్. రెడ్డి

నేడు టిడిపి నాయకుల పాదయాత్ర

ప్రజాశక్తి-కొత్తపేట

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా సోమవారం కొత్తపేట నియోజక వర్గ పరిధిలో టిడిపి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలకు వాడపాలెంలో ఇంఛార్జి బండారు సత్యానందరావు స్వగృహం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. దేవి సెంటర్, వాడపాలెం నుంచి మసీద్ సెంటర్, కమిరెడ్డి పాలెం తాళ్లమ్మ అమ్మవారి గుడి, కొత్తపేట బోడి పాలెం వంతెన 10:45 గంటలకు షిరిడి సాయిబాబా టెంపుల్, మందపల్లి వరకు పాదయాత్ర జరుగుతుందని అన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనవలసిందిగా కోరుతున్నట్లు కంఠం శెట్టి తెలిపారు.

పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

ఖండ్రిగ శివారు గుబ్బల వారి పాలెం గ్రామానికి చెందిన బొక్కా శివకుమార్ ఇటీవల బైకు ప్రమాదంలో తీవ్ర గాయం పడ్డాడు. అతపి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతోని మందులు కొనుక్కోవడానికి ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలిసి అతనితో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు రాయుడు బాబి ఆధ్వర్యంలో శివకుమార్‌కు ఆర్థిక సాయం చేశారు. గుమ్మడి ప్రవీణ్ కుమార్, బీర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.